# కాలానికి ఎదురీత

ప్రియమైన కౌశల్యా,

నీకు వుత్తరం రాద్దామని కూర్చోగానే ఎవరికని అడిగేడు మీ అంకుల్ కల్నల్ శ్యాం. నీకని చెప్పగానే తన ఆశీస్సులు కూడా రాయమన్నాడు. అంచేత నీకూ, నీ పొత్తిళ్లలో వున్న బంగారు బాబుకీ, జర్మనీలో వున్న రవికీ మా దంపతుల ఆశీస్సులు.

టెలీఫోన్ చెయొచ్చుకాని అన్ని విషయాలూ ఫోన్‌లో చెప్పాలంటే అరగంట పడుతుంది. పైగా నీ కిందులో రాస్తున్న విషయాలు శ్యాం వినకూడనివి, నువ్వు ఊహించలేనివి. రవి యిక్కడే వుంటే రవికే అన్నీ వివరంగా చెప్పేదాన్ని. ట్రెయినింగ్ కని జర్మనీ వెళ్లిన రవి తిరిగి రావడానికింకా రెండు వారాలు పడుతుంది. అతను జర్మనీ వెళ్లిన ఈ వారం రోజుల్లోనే మా పిరిస్థితుల్లో కొన్ని అనూహ్యమైన పరిణామాలు సంభవించేయి. కాలప్రభావానికి లొంగిపోయిన మేము ఎదురీతకు ఉద్యుక్తులవుతున్నాం. రెండు రోజుల్లో డెహ్రా డూన్ వెళ్లిపోతున్నాం. అందుకే యీ వుత్తరం.

నవ్వూ, రవీ నూతన దంపతులుగా మా యింట్లో పై అంతస్తులో ప్రవేశించినది లగాయతు ఈ రెండేళ్లూ మీ సహచర్యంతో విషాద అనుభవాలతో అలసి పోయిన మా మనసులు సేదతీరి, ఏ కొత్త సమస్యలూ ఉత్పన్న మవ్వకుండా కాలం గడిపేము. కొత్త సమస్యలంటున్నావు, మరి మీ పాత సమస్యలేమిటో చెప్పలేదే అంటావు. అవును ఇన్నాళ్లూ అవి మీకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడ్డాను.

మాకు ఆర్థిక సమస్య లేదు. మీకు తెలుసు. ఎయిర్ కండిషనర్, ఫ్రిజ్, టి. వి. , ఫర్నిచర్‌తో సహా సకల సదుపాయాలువున్న ఈ యిల్లు చూడ్డాని కొచ్చిన మొట్టమొదటి రోజున మీరిద్దరూ కూడబలుక్కుని "ఇంత అత్యంత ఆధునిక సౌకర్యాలతో ఇంద్ర భవనం లాగున్న ఈ యింట్లో అద్దెకి వుండే ఆర్థిక స్తోమత మాకు లేదు. మేమిద్దరం ఉద్యోగాలు చేసుకుంటున్నాం. నెల్లాళ్లయింది మేము పెళ్లి చేసుకుని. మా యిద్దరి జీతం కలిసి నెలకి పధ్నాలుగు వేలు. 'ఏ బాదర బందీ, ఎక్కువ బంధు మిత్రులరాకపోకలు లేని నూతన దంపతులకు ఇంట్లో భాగం అద్దెకివ్వబడును' అన్న మీ ప్రకటన చూసి ఏ మధ్యతరగతి కుటుంబీకుల యింట్లోనో..." అని రవి అంటుండగా-

"ఆర్థిక స్థోమత ఒకటే అర్హత కాదు. ఇప్పటికి అరడజను దంపతులొచ్చి చూసుకు వెళ్లేరు. అందులో ముగ్గురు మళ్లీ కనబడలేదు. మరో ముగ్గురు పది వేల నుంచి పది హేను వేల వరకూ అద్దె యివ్వగల మన్నారు. కాని వాళ్లకి మేము అద్దెకివ్వదల్చుకోలేదు. మా కారణాలు మా కున్నాయి. మీ రీయింటి కెంత అద్దె యివ్వగలరు?' అని అడిగేడు కల్నల్.

"మాకు ఏం చెప్పడానికీ నోరు రావటం లేదు. మాకీయింట్లో వుండే యోగ్యత లేదని చెప్పడం సభ్యత.." అని నువ్వంటున్నావు.

"ఎం.. త... యి.. వ్వ.. గ.. ల.. రు?" అంటూ ఉరిమేడు కల్నల్.

"అయిదు వేలు" అన్నావు ధైర్యంగా.

"ఎప్పుడొచ్చి చేరతారు?" అని కల్నల్ అడిగేడు.

"వారం రోజుల్లోమంచి రోజు చూసుకుని, ముందు మీకు ఫోన్ చేసి ఒక నెల అద్దె ఎడ్వాన్స్ తీసుకొస్తాం" అన్నావు జ్ఞాపకముందా!

"ఎడ్వాన్సక్కర్లేదు. మీ కూడా ఏం సామాన్లు తెచ్చుకుంటున్నారో ముందు చెప్పండి" అని అడిగేడు కల్నల్.

"గ్యేస్ స్టౌ, వంట సామాన్లు. టీ సెట్లు డిన్నర్ సెట్లతో సహా సమస్తం వున్నాయి. మేమిద్దరం చెరో సూట్‌కేస్‌తోనూ బట్టలు తెచ్చుకొస్తే చాలనుకుంటాను" అన్నాడు రవి. "అంతే! అంతకంటే యేమి అక్కర్లేదు. కారణం తెలుసా! నేను మిమ్మల్ని ఎప్పుడు ఖాళీ చెయ్యమన్నా వెంటనే కాళీ చెయ్యడానికి సులువుగా వుంటుంది." అన్నాడు శ్యాం.

అది విని నువ్వు బిక్కమొహం వేశావు. ఏం పర్వాలేదని నేను కళ్లతో చేసిన సౌంజ్ఞని గ్రహించేవు. మీ రింట్లో ప్రవేశించిన తర్వాత నీకూ రవికీ రహస్యంగా "మనం మాట్లాడుకునేటప్పుడు మా సంసారిక జీవితానికి సంబంధించిన గతాన్ని గురించి ఆరా తియ్యడానికి ప్రయత్నించనన్నాళ్లు మీరు యిల్లు ఖాళీ చేసే అవసరం వుండదు" అని హామీ యిచ్చేను. దానికనుగుణంగానే యీ రెండేళ్లూ మీరు నడుచుకున్నారు. మనం నలుగురం ఒక కుటుంబ సభ్యుల్లాగ సరదాగా గడిపేసేం.

నువ్వు పుట్టింటికి గర్భవతిగా రాత్రి బయల్దేరి వెడతావనగా ఆ సాయంత్రం మాటల సందర్భంలో, "నీకు బాబు అంటే యిష్టమా పాప అంటే యిష్టమా?" అని అడిగేను. నీకు పాపంటేనే యిష్టం అన్నావు నవ్వుతూ.

"మాకు బాబే కావాలి. బాబే పుట్టబోతున్నట్టు స్కేనింగ్‌లో తెలిసింది. వాడు మిలిటరీ ఆఫీసరవ్వాలి." అన్నాడు రవి బహుశా కల్నల్ సంతోషిస్తాడని.

"తర్వాత పిల్లలు పుడతారో పుట్టరో! పరిస్థితులెలాగుంటాయో! ఒక్కడే బాబయితే ఆర్మీ కెలా పంపుతాము!" అన్నావు, మాతృహృదయానికి సహజమై స్పందనతో. అప్పుడు ఏంజరిగిందో గుర్తుకు తెచ్చుకో. వెంటనో ఉద్రేకంతో కందగడ్డలాగ ఎర్రబడిన మొహంతో కళ్లెర్ర చేసి, "ఒక్క కొడుకే అయితే సైన్యంలో చేరకూడదా! మా నాన్న సాధారణ సైనికుడిగా చేరి లెఫ్టినెంట్ కల్నల్ అయ్యేడు. మా నాన్నకి నేనొక్కడ్నే కొడుకుని. మాకూ ఒక్కడే కొడుకు. మేజర్ ఆనంద్. వాడు ఇరవై యెనిమిది యేటనే మేజర్ రేంక్ సంపాదించేడు. సామూహిక సైనిక సహ జీవనం. ఒక విశాల ప్రపంచం. మా భార్యా బిడ్డల్ని పోషించుకోవడమే మా ధ్యేయం అనే సంకుచిత భావం మా కుండదు. దేశ పరిరక్షణ శిక్షణ క్రమశిక్షణలకు అంకితమైన మా అందరిదీ ఒకే కులం - సైనికులం. దేశం కోసం ప్రాణాలైనా అర్పిస్తాం అన్న దృఢచిత్తమే మా ఊపిరి. మా జీవితాలకొక పరమార్థం పరిపూర్ణత వున్నాయి అని కల్నల్ భావోద్వేగంతో మాట్లాడుతుండగా, ఇంక ఆ అంశం మీద సంభాషణ నిలిపెయ్యాలన్న వుద్దేశ్యంతో మీ వైపు తిరిగి 'గుడ్ నైట్' అని కన్ను సౌంజ్ఞ చేసేను. "కల్నల్ యు ఆర్ రైట్" అంటూ రవీ, గుడ్‌నైట్ అంటూ అతని వెనక్కాల నువ్వూ మేడ మెట్లెక్కేసారు. కల్నల్ బుజం మీద చెయ్యేసి నెమ్మదిగా లోపలికి తీసుకెళ్లేను.

మే మిద్దరం ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. నిత్యం, మధ్యాహ్నం రాత్రి మేము భోంచేసే టప్పుడు మా అల్సేషన్ డాగ్స్ రాజా, రాణి, మా టేబుల్ దగ్గర కల్నల్ పెట్టే మొదటి ముద్ద కోసం కాచుక్కూచుంటాయి. అంచేత మాతో బాటే అవీ ఉపవాసం చేసి కల్నల్ మంచం పక్కనే కూర్చున్నాయి. చివరికి, ఏ మార్ఫిన్ దుష్ప్రభావం నుంచి కల్నల్‌ని రక్షించాలనుకున్నానో ఆ యింజక్షన్ ఒకటి చేస్తేనే కాని కల్నల్ నిద్ర పోలేదు.

మేజర్ ఆనంద్ కల్నల్ కొడుకు, నాకు పుట్టిన వాడు కాదు. నాకు పిల్లలు లేరు. నేను కల్నల్ తాళి కట్టిన భార్యను కాను. మా హాల్లో వున్న కల్నల్ కుటుంబం తాలూకు ఫోటోలన్నీ, గతాన్ని గురించిన జ్ఞాపకాలను దూరం చెయ్యాలని, తీసేసేను.

కల్నల్ శ్యాం మనం అందరం గర్వించతగ్గ గొప్ప వ్యక్తిత్వం గల మిలిటరీ ఆఫీసర్. మీరు చూశారు కదా ఏభయ్‌రెండో యేట కూడా మంచికండలు తిరిగిన శరీరంతో చక్కని భారీ విగ్రహం. చాలా ఉదారస్వభావంగల సైనికోద్యోగిగా పేరు తెచ్చుకున్నాడు. అతను కేప్టెన్‌గా వున్నప్పుడు తన యిరవై మూడో యేట తోడి కేప్టెన్ హర్బాన్ సింగ్ చెల్లెలు, సుర్జీత్ కౌర్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె కూడా చాలాఅందమైంది,

తెలివైంది, విద్యావతి. ఈ దంపతులు, అందరూ చూసి ఈర్ష్య పడేటట్టు, ఎంతో అన్యోన్యంగా వుండేవారు. పెళ్లయిన ఏడాదికే వాళ్లకి ఆనంద్ పుట్టేడు. తర్వాత పిల్లలు కలగ లేదు.

ఆనంద్‌ని పదకొండవ యేట నేషనల్ డిఫెన్స్ ఎకాడమిలో చేర్పించేరు. రూపు రేఖల్లోనూ, తెలివితేటల్లోనూ, ధైర్యసాహసాల్లోనూ తండ్రికి మించిన కొడుకనిపించుకుని ఇరవై ఎనిమిదో యేటనే మేజర్ అయ్యేడు. సుర్జీత్‌కి అయిదేళ్ల క్రితం కేన్సర్ వల్ల ఒక వైపు, రెండేళ్ల క్రితం రెండో వైపు వక్షోజాలు తీసేసేరు. దానితో ఆమె మానసికంగానూ, శారీరకంగానూ ఆరోగ్యం కోల్పోయింది.

ఆమె ప్రోద్భలంతో హర్భాన్ సింగ్ కూతురు నీతూకి ఆనంద్‌తో పెళ్లినిశ్చయమైంది. మేనరికం అవుతుంది కనక ఏ విధమైన ఆరోగ్యసమస్యలూ రాకూడదన్న వుద్దేశ్యంతో వైద్య పరీక్షలు చేయించి సంతృప్తిపడి మరో మూడు నెలల తర్వత వాళ్ల వివాహ ముహూర్తం పెట్టుకున్నారు. మేజర్ ఆనంద్ కాశ్మీర్ లోయలో సైనిక వ్యూహం పరిశీలించడానికి వెళ్లేడు. అక్కడ మిలిటెంట్ల మెరుపు దాడి నుండి తప్పించుకోవడంలో తలకు బలమైన దెబ్బ తగిలింది.

శస్త్ర చికిత్స చేసిన నెల్లాళ్లతర్వాత మెదడుకు తగిలిన దెబ్బవల్ల చూపు పోయే ప్రమాదం వుందని నిర్ధారించేరు. అంధుడైనా సరే ఆనంద్‌నే పెళ్లాడతానంది నీతూ. వెంటనే కల్నల్ రెండేళ్ల క్రితం ఇక్కడజూబిలీ హిల్స్‌లో మేమున్న యిల్లు యిరవైలక్షలకు కొని కిందా పైనా అన్ని హంగులు ఏర్పాటుచేసేడు. పెళ్లయిన తర్వాత నూతన దంపతులిక్కడ వుంటే కల్నల్ కూడా కొన్నాళ్లుండి ఆనంద్‌కి అవసరమైన నేత్ర చికిత్స చేయించవచ్చునుకున్నాడు.

గత అయిదేళ్లలోనూ సుర్జీత్‌కి రెండు సార్లు శస్త్ర చికిత్స జరగడం ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించడం కారణంగాయిక్కడ మిలిటరీ హస్పటల్‌కి తరచు కల్నల్ దంపతులు వొచ్చేవారు. నేను యిక్కడ డాక్టర్ (మేజర్)గా వుండటం వల్ల మా పూర్వ పరిచయం స్నేహంగా మారింది. ముఖ్యంగా సుర్జీత్ రెండు రోజులు కోసారైనా యింటికి పిలిచి అతిథి మర్యాదలు చేసేది. దాని ఆంతర్యం తర్వాత ఆమే బయట పెట్టింది. ఓ సారి కల్నల్ యింట్లో లేని సమయంలో నాతో, "కళ్యాణీ! నేనెక్కువనాళ్లు బ్రతుకుతాననుకోను. నా జీవిత పరమావధి ఆనంద్‌నీతూల వివాహం చూడటమే. ఆ తర్వాత నువ్వు కల్నల్‌ని వివాహం చేసుకుంటానని మాటివ్వాలి" అంటూ నా రెండు చేతులూ పట్టుకుంది. నేను నిర్ఘాంతపోయేను. "వాళ్ల వివాహం అయిన తర్వాత నూతనోత్సాహంతో నీ ఆరోగ్యం

పుంజుకుంటుంది. ఇలాంటి ఆలోచనలు కట్టిపెట్టు" అని నోటితో మందలించేను. మనసులో నాకా ఆలోచన కలగకపోలేదు. 'శ్యాం కూడానీలాగే నా ఆరోగ్యం బాగుపడుతుందని మభ్యపెట్టి నన్నిలా నిరాశపడవొద్దని ధైర్యం చెబుతూ ఉంటాడు. కాని నాకు తెలుసు నా జీవితానికి అంత్యం ముంచుకొస్తుందని. అయినా మంచాన పడి వుండీ బ్రతుకు భరించలేను. కల్నల్‌కీ నీకూ సైనికోద్యోగులుగా ఉజ్వలమైన భవిష్యత్తు వుంది. అతని జీవితం విషాదభరితం కాకుండా వుండాలంటే అది నీ సహచర్యం వల్లనేసాధ్యం' అంది.

నేను అవివాహితనైన కన్యని కాదనీ, నాకున్న ప్రేమ కలాపాలు నాకున్నాయనీ, నా ఆత్మగౌరవాన్ని కాపాడుకోగల సమర్ధురాలిననీ సుర్జీత్‌కి తెలుసు. భర్త మీద వుండే ప్రగాఢమైన ఆమె అనురాగాన్ని అతని భవిష్యత్తు గురించి ఆందోళననీ నేనర్ధం చేసుకోగలను. ఆ రోజుల్లో శ్యాం నన్ను రహస్యంగా కలుసుకుని క్షీణిస్తున్న సుర్జీత్ ఆరోగ్యం పరిస్థితి గురించి మాట్లాడేవాడు. సుర్జీత్ మాతో అన్న మాటలు ప్రస్తావించుకోవడం కూడా జరిగింది.

మేజర్ ఆనంద్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నా అతని దృష్టిపోవడం భరించలేక మానసిక వ్యధతో 'సెరిబ్రల్ హేమరేజ్‌కి గురై మరణించేడు. ఆ వార్త వినగానే సుర్జీత్ బీరువా తెరిచి కల్నల్ రివాల్వర్ తీసుకుని తలకు గురిపెట్టి కాల్చుకుని చచ్చిపోయింది. కుమారుడి మృతదేహన్నయినా చూడలేదు. హైదరాబాద్‌లో వున్న శ్యాం ఆ రాత్రికి చేరుకుని కుమారుడు, భార్యల మరణాలతో ఎలా కృంగిపోయి వుంటాడో నువ్వూహించుకో.

కొన్నాళ్ళు ఆ దుఃఖోపశమనానికి మార్ఫిన్ ఇంజక్షన్ యివ్వవల్సి వచ్చింది. అది అలవాటుగా మారింది. దానిబారి నుండి బయట పడటానికి స్థలం మార్పుకావాలని కల్నల్‌ని వెంట బెట్టుకుని యిక్కడకొచ్చేను. రెండు నెలలైనా కల్నల్ పూర్తిగా తేరుకోలేదు. మా యిద్దర్నీ సర్వీస్‌లోంచి రిటైర్ చేయించమని కల్నల్ హర్భాన్ సింగ్‌కి రాశాం. తర్వాత నేనిచ్చిన ప్రకటనకి సమాధానంగా మీరొచ్చి యింట్లో చేరేరు.

నాలుగు రోజుల క్రితం ఇక్కడున్న సైనిక కేంద్ర వార్షికోత్సవానికి ముఖ్య అతిధిగా వొచ్చిన బ్రిగేడియర్ హర్భాన్ సింగ్ పనిగట్టుకుని మా యింటి కొచ్చి ఒక పూట వున్నాడు. ఇప్పుడతను బ్రిగేడియర్‌గా ప్రొమోట్ అయ్యేడు.

"మేజర్ జనరల్‌తో స్వయంగా మాట్లాడి మీ వలంట్రీ రిటైర్మెంట్ అప్లికేషన్లు పెండింగ్‌లో పెట్టించేను. శ్యాం ఆరోగ్యం సంతృప్తికరంగా వుందనీ కార్గిల్ సంక్షోభం

ప్రారంభమైనప్పట్నుంచీ మీరిద్దరూ, అవకాశమిస్తే తిరిగి డ్యూటీలో చేరతామనీ నువ్వు రాసిన దరఖాస్తు అందింది. మేజర్ జనరల్ అనుమతించేడు. వెంటనే బయల్దేరి మీరు డెహ్రాడూన్‌కి వొచ్చి డ్యూటీలో చేరి పోవచ్చు అన్న శుభవార్త చెప్పేడు. మా ఆనందానికి అవధుల్లేవు. కల్నల్ ఉత్సాహం ఇంతా అంతా కాదు. అతను బ్రిగిడియర్ అవ్వడానికి ఇంకాఏడాది వ్యవధి వుంది. తప్పకుండా అవుతాడు. సుర్జీత్ ఆశయం నెరవేరుతుంది. ఆమె ఆత్మ శాంతిస్తుంది.

ఆనాడు కల్నల్ మాటల్లో ఆవేశానికి, కారణం భార్యనీ, కొడుకునీ పోగొట్టుకున్న విషాద జ్ఞాపకాలు కాదు. అతనిలో ఈ కార్గిల్ సంక్షోభం తాలూకు వార్తలతో సైనిక రక్తం ఉప్పొంగింది. మా అభ్యర్థనకి అనుకూలంగా మేజర్ జనరల్ స్పందిస్తాడో లేదో అన్న ఆందోళన జవాబు రావడంలో జాప్యం, నిరుత్సాహం కారణాలు.

నాలుగు రోజుల క్రింద యిచ్చిన ప్రకటన ఫలితంగాఈ యిల్లు నలభై లక్షలకు అమ్మేశాం. అందులో వెంటనే ముప్ఫయి లక్షలు సైనిక సంకేమ నిధికి విరాళంగా పంపేడు. రెండు రోజుల్లో బయల్దేరి వెడుతున్నాం. ఈ రెండేళ్ల మీ సహచర్యానికిమా హృదయ పూర్వక కృతజ్ఞతలు. డూన్‌లో డ్యూటీలోచేరేక నీకుపుత్తరం రాస్తాను.

రవిజర్మనీ నుంచి తిరిగొచ్చేటప్పటికి మా యింటిగేటు ప్రక్కన గోడకి వున్న "కల్నల్ శ్యాం సుందర్, మేజర్ కల్యాణి, రాజ, రాణి" అని రాసి వున్న బోర్డ్ వుండదు. మీ సుట్‌కేసులు భద్రంగా యిక్కడే వున్నాయి. రవి తిరిగి రాగానే నారాయణ అప్పగిస్తాడు. ఇప్పుడే కల్నల్ మీ బంగారు బాబుకు బహుమతిగా నీ పేర 'పది వేల రూపాయిల చెక్కు యిచ్చిన నీకు పంపమన్నాడు. ఇందులో వుంది.

మా ఆశీస్సులతో

-నీ కల్యాణి.

కథా నిలయం
శ్రీకాకుళం

* *రచన, సెప్టెంబరు 1999*